# స్వాతంత్ర్యం

అతను ఓ పెద్ద రచయిత. చతుర్విధ స్వాతంత్ర్యాలూ అక్షరాలా అమలు జరగాలనే పట్టుదలగల వాడు. ఓ ప్రసిద్ధ జాతీయవాదిచే నడుపబడుతోన్న పత్రికకు సంపాదకుడుగా పనిచేస్తున్నాడు.

ఒకరోజున ఆకస్మికంగా పత్రికాధిపతి అతనికి శ్రీముఖం అందించాడు.

"ఆఁ ! ఉద్యోగంనుంచి తొలగించారా ? కారణం ?

"ఔను. మీరు నిన్న పత్రికా రచయితల సంఘానికి అధ్యక్షత వహించారట."

"ఔను. కాని-మీరు నా స్వాతంత్ర్యానికి ఎలాంటి ఆటంకాలూ వుండవన్నారుగదా ! మొదట-"

"ఇప్పుడుమాత్రం ? - నిన్ను ఉద్యోగంలో వుంచడమా ? మానడమా ? నిర్ణయించే స్వాతంత్ర్యం నాకున్నది. ఆ స్వాతంత్ర్యాన్నే నేను అమలుజరుపుకొంటు న్నాను. అంతే. స్వాతంత్ర్యం చాలా పవిత్రమయింది. దాని రక్షణ ప్రతివారి విధి."

అతనికి అర్థమయింది.

—వర్గసమాజంలోని స్వాతంత్ర్యానికి అర్థం.